ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 22 మే 2024



రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

తుమ్మపాల, మే 21: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 35.6 నుంచి 38.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉండొచ్చునన్నారు. తొలకరి వర్షాలు ద్వారా రైతులు లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటలకు సిద్ధమయ్యే రైతులంతా నేలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ అడ్మిషన్ల సందడేది?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంకా ప్రారంభంకాని ప్రక్రియ

ప్రైవేటు కాలేజీల్లో జోరుగా ప్రవేశాలు

- రెండేళ్లుగా ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్న విద్యాశాఖ
- తగ్గుముఖం పడుతున్న ఉత్తీర్ణత శాతం
- ప్రభుత్వ కళాశాలలపై ఆసక్తి చూపని విద్యార్థుల తల్లిదండ్రులు



పరవాడ జూనియర్ కాలేజీ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ ఇంకా ప్రారంభంకాలేదు. గత ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండడంతో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో అడ్మిషన్లు ప్రారంభంకాలేదు.

జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఒక్కో కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 100 మంది చొప్పున ప్రతి ఏడాది 400 మందికి అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుంది. దీంతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో 80 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తారు. అయితే ప్రతి ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల విషయంలో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు చేస్తున్న జాప్యం వల్ల విద్యార్థులను ప్రైవేటు యాజమాన్యాలు ఎగరేసుకుపోతున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం కూడా ఆశాజనకంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వ, కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలు, గురుకులాలు, ప్లస్‌టూ స్కూల్స్ నుంచి 10,443 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు హాజరు కాగా, 5442 మంది (52 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 9,248 మంది పరీక్షలు రాయగా, 6,119 మంది (66 శాతం) ఉత్తీర్ణత పొందారు. ఈ ఫలితాలను చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ కళాశాలల్లో పిల్లలను చేర్పించేందుకు వెనుకాడుతున్నారు.

ఇంకా ఇన్‌చార్జుల పర్యవేక్షణలోనే...?

జిల్లా ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ప్రభుత్వ కళాశాలల నిర్వహణ గాడిన పడలేదు. రెండేళ్లుగా పూర్తిస్థాయిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి లేకుండానే ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. రెండేళ్లలో ముగ్గురు జిల్లా ఒకేషనల్ అధికారులు (డీవీఈవో)లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారులు (డీఐఈవోలు) ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. వీరు జిల్లాలో అన్ని కళాశాలలను తిరిగి పర్యవేక్షించాల్సి ఉన్నా, మొక్కుబడిగా విధులు నిర్వహిస్తుండడంతో కళాశాలలపై పర్యవేక్షణ కొరవడుతోంది. అంతేకాకుండా డీవీఈవోలు తమ హోదా కలిగిన ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు కళాశాలల నిర్వహణ, అడ్మిషన్‌లు, ఫలితాల విషయంలో కచ్చితమైన ఆదేశాలు ఇవ్వలేకపోతున్నారు. దీంతో కళాశాలల నిర్వహణ అధ్వానంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అడ్మిషన్లపై స్పష్టత ఏదీ?

జిల్లాలో ఒకవైపు ప్రైవేటు కళాశాలల్లో ఇప్పటికే అడ్మిషన్‌లు పూర్తికాగా, ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం అడ్మిషన్ల విషయంలో అధికారులకు స్పష్టత రాలేదు. వాస్తవానికి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ కళాశాలల్లో అడ్మిషన్లు కొనసాగించాల్సి ఉన్నా, ఎక్కడా ఆ విధంగా చేయడం లేదు. కేవలం మొక్కుబడిగా అడ్మిషన్లు జరుగుతున్నట్టు కళాశాలల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఆయా పరీక్షల నిర్వహణ ఏర్పాట్లలో ఉన్న అధికారులు ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల విషయంలో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటు కళాశాలల్లో జోరందుకున్న అడ్మిషన్లు

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ఇంకా ప్రారంభంకాకపోయినా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు మాత్రం విద్యార్థుల వేటలో పడ్డారు. విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి కేంద్రంగా నడుస్తున్న కొన్ని కార్పొరేట్ కళాశాలల నుంచి పీఆర్‌వోల పేరుతో ప్రతినిధులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రవేశాలు కోసం చర్చలు జరుపుతున్నారు.

విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించి కళాశాలలకు రావాలని ఆహ్వానం పలుకుతున్నారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందించి, ఫీజు రాయితీలు కూడా ఇస్తామని హామీలు గుప్పించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్వాన్సుల రూపంలో కొంత మొత్తం నగదు కట్టించుకొని సీటు రిజర్వు చేయిస్తున్నట్టు సమాచారం. ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం కాకపోవడంపై జిల్లా ఇన్‌చార్జి డీఐఈవో సుజాత వద్ద ప్రస్తావించగా సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయిన తరువాత అడ్మిషన్ల వేగం పుంజుకుంటుందని చెప్పారు. ఈసారి పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

సబ్బవరంలోని అప్పలనర్సయ్య బంద కబ్జా

- పక్కనే ఉన్న గెడ్డ వాగు పూడ్చివేత
- రాత్రి వేళల్లో యంత్రాలతో పనులు
- సాగునీటి వనరులు కనుమరుగు
- పట్టించుకోని అధికారులు



సబ్బవరం సర్వే నంబరు 233లోని గెడ్డ వాగును పూడ్చివేసిన దృశ్యం

సబ్బవరం, మే 21:

మండలంలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోయింది. కోట్లాది రూపాయల విలువైన భూములను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సబ్బవరంలోని ఎస్‌టీబీఎల్ సినిమా హాల్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో సర్వే నంబరు 254లో 1.66 ఎకరాల్లో అప్పలనర్సయ్య బంద ఉంది. దీనిని ఆనుకొని సర్వే నంబరు 233లో 3.08 ఎకరాల్లో గెడ్డ వాగు ఉంది.



అప్పలనర్సయ్య బందను చదును చేసిన దృశ్యం

అధికారులు ఎన్నికల హడావిడిలో ఉండగా గత ఇరవై రోజులుగా అప్పలనర్సయ్య బందతో పాటు దానిని ఆనుకొని ఉన్న గెడ్డ వాగును కొందరు ఆక్రమించి యంత్రాలతో రాత్రి వేళల్లో చదును చేసి ప్లాట్లుగా తయారు చేస్తున్నారు. దీనిని అడ్డుకునేందుకు వెళ్లిన స్థానికులను ఆక్రమణదారులు బెదిరిస్తున్నారు. దీనిపై గెడ్డం వీధికి చెందిన ఎల్.సంతోషి, జి.లలిత, లక్ష్మి, చిట్టెమ్మ, గెడ్డం జయలక్ష్మి తదితర 40 మంది మహిళలు మంగళవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌కు ఫిర్యాదు చేశారు. కోట్లాది రూపాయల విలువైన సాగునీటి వనరులను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర దర్యాప్తు చేసి మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని వారికి ఆయన హామీ ఇచ్చారు. కాగా సర్వే నంబర్లు 254, 233తో పాటు సర్వే నంబర్లు 259, 260లోని గెడ్డ వాగులను ఆక్రమించి జిరాయితీలో కలిపి కొంత మంది లేఅవుట్లు వేస్తున్నట్టు కూడా తమ దృష్టికి వచ్చిందని, సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని ఆర్ఐ వీరయ్య తెలిపారు.

తెలంగాణ ఏసీపీ ఇంట్లో సోదాలు

- లింగభూపాలపుర అగ్రహారంలోని ఉమామహేశ్వరరావు స్వగృహంలో ఏసీబీ తనిఖీలు



ఎల్‌బీపీ అగ్రహారంలోని ఉమామహేశ్వరరావు ఇంట్లో తనిఖీలు చేస్తున్న తెలంగాణ ఏసీబీ అధికారులు

బుచ్చెయ్యపేట, మే 21:

తెలంగాణ సీసీఎస్ విభాగంలో ఏసీపీగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఆ రాష్ట్ర ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి ఏకకాలంలో ఆయనతో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఉమామహేశ్వరరావు స్వగ్రామమైన అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం లింగభూపాలపుర అగ్రహారంలో మంగళవారం రాత్రి తెలంగాణ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు అక్కడికి వచ్చిన ఏసీబీ అధికారులు ఇంట్లో ఉన్న ఉమామహేశ్వరరావు బంధువుల సమక్షంలో రెండు గంటల పాటు రికార్డులను, బీరువాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీలు ముగిసిన వెంటనే ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నలుగురు ఏసీబీ అధికారులు కారులో వెళ్లిపోయారు. దీని వివరాలపై వారిని విలేకరులు ప్రశ్నించగా తెలంగాణలో వెల్లడిస్తామని వారు తెలిపారు.

రోలుగుంటలో ..



రోలుగుంటలో మడ్డు జోగినాయుడు ఇంట్లో సోదాలు చేస్తున్న తెలంగాణ ఏసీబీ అధికారులు

రోలుగుంట: రోలుగుంటలో మంగళవారం ఉదయం ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. తెలంగాణ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు కేసుకు సంబంధించి రోలుగుంటలోని సంతబైల వీధిలో ఉన్న మడ్డు తమ్మునాయుడు ఇంట్లో సోదాలు చేశారు. మంగళవారం ఉదయమే ఏపీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్(జీఎస్టీ) అన్న బోర్డుతో ఉన్న కారు, పోలీసుశాఖకు చెందిన బోర్డుతో ఉన్న కారులో రెండు బృందాలుగా తెలంగాణ ఏసీబీ అధికారులు వచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సిబ్బందిని సోదాలు చేసే ఇంటి వివరాలపై వాకబు చేశారు. వారి సహాయంలో మడ్డు తమ్మునాయుడు ఇంటి వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకుని మధ్యాహ్నం మూడు గంటల వరకు సోదాలు చేశారు. ఇంట్లో ఉన్న బంధువుల వివరాలు సేకరించారు. మడ్డు తమ్మునాయుడు కుమారుడు మడ్డు జోగినాయుడు స్పెషల్ పార్టీ పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం విశాఖ సింహాచలం దేవస్థానం సెక్యూరిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ జోగినాయుడుకి, ఏసీపీ ఉమామహేశ్వరరావు బంధువులకు సంబంధాలు ఉండడం కారణంగానే సోదాలు చేసినట్టు సమాచారం. సోదాల వివరాలు వెల్లడించడానికి ఏసీబీ అధికారులు నిరాకరించారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

తాండవ నదిలో రేయింబవళ్లు అక్రమ తవ్వకాలు

- నదిలోని ఇన్ ఫిల్టర్ వెల్‌నూ వదలని వైనం
- పట్టించుకోని రెవెన్యూ, గనుల శాఖల అధికారులు



తాండవ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం

నాతవరం, మే 21:

మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు రేయింబవళ్లు తాండవ నదిలో తవ్వకాలు జరుపుతున్నారు. దర్జాగా ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని చమ్మచింత, చిక్కుడుపాలెం, గుమ్మిడిగొండ వద్ద గల తాండవ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లలో ... మిగతా 8వ పేజీలో



చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో ఇన్‌ఫిల్టర్ వెల్ దగ్గర ఇసుక తవ్వకాలు జరిపిన దృశ్యం

రికార్డులు లేని వాహనాలు సీజ్

జిల్లాలో పలు చోట్ల విస్తృతంగా వాహనాల తనిఖీ

- 119 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలు స్వాధీనం

అనకాపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మంగళవారం జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని 119 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.



అనకాపల్లి శివారులోని సుబ్రహ్మణ్యం కాలనీ, డీబీ కాలనీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు లేని వాహనాలు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు గత కొద్ది రోజులుగా తనిఖీలు జరుపుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం అనకాపల్లి పట్టణ శివారులోని సుబ్రహ్మణ్యం కాలనీ, డీబీ కాలనీలో పోలీసులు జరిపిన తనిఖీల్లో రికార్డులు లేని 10 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. మునగపాక మండలం నాగులాపల్లిలో జరిపిన తనిఖీల్లో 41 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం బీసీ కాలనీ, పెదబొడ్డేపల్లిలో జరిపిన తనిఖీల్లో రికార్డులు లేని 68 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక వ్యాన్‌తో పాటు కారును స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ పరిధిలో పోలీసులు జరిపిన తనిఖీల్లో రవాణాశాఖ నిబంధనలు పాటించని వాహన దారులకు అపరాధ రుసుము విధించారు. రికార్డులు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కిర్గిస్థాన్‌లో బిక్కుబిక్కుమంటున్న భారతీయ విద్యార్థులు

- వారం రోజులుగా నిద్రాహారాలకు దూరం
- అక్కడి కష్టాలను వివరించిన జిల్లా యువకుడు

వైద్య విద్యను అభ్యసించేందుకు కిర్గిస్థాన్ వెళ్లిన భారతీయ విద్యార్థులు వారం రోజులుగా నిద్రాహారాలు కరువై బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.
- వివరాలు మెయిన్‌లో..

క్రైం... crime news

బస్సు ఢీకొని యువకుడి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వినయ్

నక్కపల్లి, మే 21: మండలంలోని ఉద్దండపురం హైవే వద్ద మంగళవారం మధ్యాహ్నం జరి గిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మండలంలోని రేబాక నుంచి అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీకి కార్మికులను తీసుకువెళుతున్న బస్సు ఉద్దండపురం హైవే జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో తుని నుంచి విశాఖ వైపు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వస్తున్న వినయ్ (33) అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు దుర్గేశ్ (32) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన యువకుడిని తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిద్దరు విశాఖకు చెందిన వారిగా గుర్తించారు. ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతిపై కేసు నమోదు


చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందిన సంతోష్

రావికమతం, మే 21: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి కారణమైన మేడివాడ గ్రామానికి చెందిన జి.స్వామినాయుడుపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ధనుంజయనాయుడు తెలిపారు. మేడివాడ శివారు అప్పలమ్మపాలెంనకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా శనివాడ సంతోష్ (21) పని చేస్తుంటాడు. అయితే, ఈనెల 14న ఇదే పంచాయతీ శివారు బాదనపాడుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిని పునరుద్ధరించే పనిని మేడివాడకు చెందిన స్వామినాయుడు (మరో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్) సంతోష్‌కు పురమాయించాడు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తానని స్వామినాయుడు భరోసా ఇవ్వడంతో సంతోష్‌ను స్తంభంపైకి వెళ్లి మరమ్మతు చేస్తుండగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ఆయన విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. సంఘటనా స్థలానికి సమీపంలో పనిచేస్తున్న తన మామ గుర్తించి తీ వ్రగాయాలైన సంతోష్‌ను సహచరుల సహాయంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ సంతోష్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. దీనికి సంబంధించి మృతుడు తల్లి చిన్నమ్మలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తానని చెప్పి నిర్లక్ష్యంగా వ్యవహరించి సంతోష్ మరణానికి కారణమైన స్వామినాయుడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెచ్‌సీ దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన వెంకటపతిరాజు

తగరపువలస, మే 21: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వలందపేట వద్ద మంగళవారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ కె.హరీశ్ తెలిపిన వివరాల మేరకు... దండు వెంకటపతిరాజు (64) 2018లో హెడ్ కానిస్టేబుల్‌గా పదవీ విరమణ చేశారు. కుమారుడు మనోజ్‌కుమార్ లండన్‌లో చదువుకుంటున్నాడు. వీరి కుటుంబం తాళ్లవలస రాజేష్ రెసిడెన్సీలో నివాసముంటోంది. గ్రామ దేవత పండగ నేపథ్యంలో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం సంగివలస మూడు గుళ్ల అమ్మవార్ల సెంటర్‌కు వెంకటపతిరాజు స్కూటీపై వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా ఆయన ద్విచక్రవాహనాన్ని వలందపేట వద్ద ఎదురుగా విశాఖ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొని కొంతదూరం ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమైన వెంకటపతిరాజు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారు డ్రైవర్ అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన వర్రి నందకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమార్తె రుద్రరాజు సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హరీశ్ తెలిపారు

26న గీతం ఎంట్రన్స్ టెస్ట్

సాగర్‌నగర్, మే 21: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశానికి ఈనెల 26న గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్) నిర్వహిస్తున్నట్టు స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వేదవతి తెలిపారు. బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాలుగేళ్ల బీఎస్సీ (ఆనర్స్) కోర్సులు, మూడేళ్ల బీసీఏ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో రెండేళ్ల ఎమ్మెస్సీ కోర్సులుంటాయని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో ప్రవేశానికి ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చునన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఒడిశా దాసుడు


ఆలయంలో పరివారంతో దాసుడు

సింహాచలం, మే 21: వరాహలక్ష్మీనృసింహస్వామిని ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయకోదాసుడు మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు, శిష్యపరివారంతో దర్శించుకున్నారు. ఆలయ కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండప ప్రదక్షిణలు చేసిన తరువాత అంతరాలయంలో పూజలు జరిపించారు. స్వామికి ప్రీతికరమైన సుగంధ పరిమళభరిత సంపెంగలు, మల్లెలు, విరజాజులతోపాటు, మామిడి అరటి పండ్లను సమర్పించారు. అనంతరం గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

సింహాచలంలో నేడు నృసింహ జయంతి

సింహాచలం, మే 21: నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని ఈనెల 22న నృసింహవనంలోని స్వామివారి విగ్రహం వద్ద సాయంత్రం నాలుగు గంటలకు 'నృసింహ జయంతి'ని నిర్వహించనున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న మైదానంలో ఉదయం 8 గంటల నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని 22న సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి సర్వదర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు. స్వాతి హోమంలో పాల్గొనదలచిన భక్తులు పీఆర్వో కార్యాలయంలో ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో టికెట్లను పొందవచ్చునన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	138.00
లైవ్ ధర	158.00
విత్ స్కిన్	286.00
స్కిన్ లెస్	296.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

ఏటికొప్పాక ఎవరి వైపు మొగ్గు చూపేనో?

» గ్రామంలో పెరిగిన పోలింగ్ శాతం

» ఇక్కడ ఏ పార్టీకి మెజారిటీ వస్తే ఆ పార్టీ అభ్యర్థిని విజయం వరించడం ఆనవాయితీ


ఏటికొప్పాక గ్రామం

ఎలమంచిలి, మే 21: లక్కబొమ్మలు తయారులో జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఏటికొప్పాక సెంటిమెంట్ ఏ పార్టీని వరిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా ఎలమంచిలి అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థి ఎవరైనా తొలిసారిగా ఏటికొప్పాక గ్రామదేవత బండిమాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రచారం ప్రారంభించడం ఆనవాయితీ. వైసీపీ అభ్యర్థి యూవీ రమణమూర్తి, జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ బండిమాంబ అమ్మవారిని దర్శించుకున్న తర్వాతే ప్రచారం ప్రారంభించారు. గతంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు ఈ ఆనవాయితీని పాటించారు. ఏటికొప్పాక గ్రామానికి మరో సెంటిమెంట్ కూడా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఏటికొప్పాకలో ఏ పార్టీకి మెజారిటీ వస్తే ఆ పార్టీ నేత ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ఆనవాయితీగా వస్తుంది. ప్రజారాజ్యం సమయంలో మాత్రమే ఈ సెంటిమెంట్ వర్కవుట్ కాలేదని, మిగిలిన ప్రతి ఎన్నికల్లోనూ కొనసాగిందని స్థానికులు అంటున్నారు. మండలంలోనే ఏకైక మేజర్ పంచాయతీ అయిన ఏటికొప్పాకలో ఈసారి అధిక శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 5,148 మంది ఓటర్లలో 4,304 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. గ్రామంలోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామంలో 83 శాతం పోలింగ్ అయింది. ఇంతకు ముందెన్నడూ ఇంత పోలింగ్ శాతం నమోదు కాలేదు. 2019 ఎన్నికల్లో 76 శాతం నమోదైంది. అధికంగా యువకులు, మహిళలు ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఈసారి జరిగిన ఎన్నికల్లో సెంటిమెంట్ వర్కవుట్ అవుతుందో.. లేదోనని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శిథిలావస్థలో మైనర్ శారదా నదిపై వంతెన

» మర్రిపాలెం - రాజారాయుడుపాలెంల మధ్య ఇరువైపులా లేని రక్షణ గోడలు

» భయాందోళనలో రెండు గ్రామాల ప్రజలు


మైనర్ శారదాపై ఉన్న వంతెనకు ఇరువైపులా లేని రక్షణ గోడలు

రాంబిల్లి, మే 21: మండలంలోని మర్రిపాలెం-రాజారాయుడుపాలెం వెళ్లే గ్రామాల మధ్య మైనర్ శారదా నదిపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో నదికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు.

ఈ రెండు గ్రామాల మధ్య మైనర్ శారదా నదిపై వంతెనను 1999వ సంవత్సరంలో నిర్మించారు. అయితే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు, వాహన చోదకులు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉన్న సమయంలో మరింతగా భయపడుతున్నారు. ఈ వంతెనకు మరమ్మతులు జరిపి ఇరు వైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని మర్రిపాలెం, రాజారాయుడుపాలెం ప్రజలు కోరుతున్నారు.

రెండు ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్

» రికార్డులు లేని 10 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు సీజ్


కాలనీవాసులతో మాట్లాడుతున్న అనకాపల్లి పట్టణ ఎస్‌హెచ్‌ఓ శంకరరావు


నాగులాపల్లిలో సీజ్ చేసిన బైక్‌లతో పోలీస్ సిబ్బంది

కొత్తూరు, మే 21: అనకాపల్లి పట్టణం శివార్లలో ఉన్న సుబ్రహ్మణ్యం కాలనీ, డీబీ కాలనీల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ మంగళవారం జరిగింది. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జరిగిన ఈ ఆపరేషన్‌లో ఎటువంటి రికార్డులు లేని 10 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్ చేసినట్టు పట్టణ ఎస్‌హెచ్‌ఓ జి. శంకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాలనీవాసులతో మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ఈ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొకూడదని ఆయన హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో పట్టణ ఎస్‌ఐలు సత్యనారాయణ, అలీ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులాపల్లిలో..

మునగపాక (తుమ్మపాల), మే 21: మునగపాక మండలం నాగులాపల్లిలో మంగళవారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు ఎలమంచిలి సీఐ గఫూర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున గ్రామాల్లో మొహరించి జల్లెడ పట్టారు. ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి రికార్డులు లేని 41 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ గఫూర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎస్‌ఐ ప్రసాదరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు కార్యాచరణ

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. వేంకటేశ్వర్


వైద్య నిపుణులతో మాట్లాడుతున్న వేంకటేశ్వర్

అగనంపూడి, మే 21: గ్రామ స్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్‌కు కార్యాచరణ ప్రణాళికను వైద్య ఆరోగ్యశాఖ సిద్ధం చేస్తుందని, ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇక్కడి హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రివెంటివ్ అంకాలజీ, కమ్యూనిటీ హెల్త్ మెడిసిన్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటిస్ట్రీ, పేథాలజీ, సర్జరీ విభాగాల్లోని వైద్య నిపుణులతో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో శిక్షణ ఇచ్చేందుకు మంచి మానవ వనరులు ఉన్నాయన్నారు. శిక్షణ పొందిన వైద్య నిపుణులు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడంతో పాటు ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోలకు శిక్షణ అందించాలని సూచించారు. స్ర్కీనింగ్‌లు నిర్వహించి సంబంధిత మెడికల్ ఆఫీసర్‌లకు రిఫర్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో కేన్సర్ స్ర్కీనింగ్ విజయవంతం చేసేందుకు వైద్య నిపుణులు కృషి చేయడంతో పాటు అందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని డాక్టర్ వెంకటేశ్వర్ కోరారు. అనంతరం ఆయన వైద్య నిపుణులతో కలిసి ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట రాష్ట్ర నోడల్ అధికారులు శ్యామల, రాజ్‌కిరణ్, ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్‌మహంతి శెట్టి, డాక్టర్ రవితేజ, తదితరులు ఉన్నారు.

ఓటర్లకు లంచం ఇచ్చే సంస్కృతిని అరికట్టాలి

» ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు

విశాఖపట్నం, మే 21: ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను చూస్తే ప్రజాస్వామ్యయుత రాజకీయాలు కాకుండా.. ధనస్వామ్యమే రాజ్యమేలినట్టు కనిపించిందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముర్రుముత్యాలనాయుడు అన్నారు. పలు పార్టీలకు చెందిన నేతలు పట్టపగలే డబ్బుపంచుతూ ఓట్లు అడగడం దారుణమన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు లంచాన్ని సులభతరం చేసే అన్ని అక్రమ లావాదేవీలను అరికట్టేలా సంస్కరణలు తేవాలన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్రపతి, అన్ని రాజకీయ పార్టీల అధిష్ఠానాలకు లేఖలు రాసినట్టు చెప్పారు. ఓటు అన్నది రహస్యంగా ఉండాలని, అయితే ఇటీవల ఎన్నికల్లో ఒక్కో ఓటు కనీసం రూ.1500 పలకడం శోచనీయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీ పోలింగ్ దారుణాలు, ధన ప్రవాహంపై ఆంగ్ల పత్రికల్లో సైతం ప్రచురితం కావడం పాలకుల వైఖరి ఏమిటో స్పష్టమవుతోందన్నారు. ఎన్నికల్లో దాదాపుగా ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థి, ప్రత్యర్థి పార్టీలు రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ఈ మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 8250 కోట్లు ఉంటుందని, ఈ సొమ్మంతా ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్, పోలీస్ శాఖ కళ్లుగప్పి నేతలు తమ నేతృత్వంలో డబ్బును డోర్ డెలివరీ చేశారన్నారు.

నగదు విషయమై మహిళతో ఆటో డ్రైవర్ గొడవ

» ఆటో డ్రైవర్‌ను మేడ పైనుంచి కిందకు తోసేసిన మహిళ

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


మైలపిల్లి గురువులు (ఫైల్‌ఫొటో)

పరవాడ, మే 21 : నగదు విషయమై ఆటో డ్రైవర్ మహిళతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆమె కోపంతో ఆటో డ్రైవర్‌ను మేడ పైనుంచి కిందకు నెట్టివేయడంతో అతడు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన మైలపిల్లి గురువులు (35) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువులుకు దిబ్బపాలెం గ్రామానికి చెందిన సురపతి రాజీ కూలీ పనులకు వెళ్తూ తరచూ గురువులు ఆటో ఎక్కేది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఇదిలా ఉంటే ఆదివారం రాత్రి పది గంటల సమయంలో గురువులు మద్యం సేవించి రాజీకి ఫోన్ చేశాడు. ఆమె కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ ఓ పాస్టర్ ఇంటిపైన ఉంటుంది. మద్యం మత్తులో ఉన్న గురువులు ఆమె వద్దకు వెళ్లి నగదు విషయమై మాట్లాడాడు. ఈ క్రమంలో ఇరువురు మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె కోపంతో గురువులను నెట్టి వేయడంతో కిందకు పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు గాయాలపాలైన గురువులును కుటుంబసభ్యులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇదిలా ఉంటే పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలించారు. దాడికి పాల్పడిన రాజీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గురువులు మృతదేహానికి విశాఖ కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు భార్య యల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఈ-సెట్‌లో జిల్లా విద్యార్థి సత్తా

» మెటలార్జికల్ ఇంజినీరింగ్ విభాగంలో మొదటి ర్యాంకు


అలవెల్లి ఖ్యాతీశ్వర్

పరవాడ, మే 21: మండలంలోని వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం గ్రామానికి చెందిన అలవెల్లి ఖ్యాతీశ్వర్ తెలంగాణ ఇంజినీరింగ్ ప్రవేశపరీక్ష (టీఎస్ ఈ-సెట్) మెటలార్జికల్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించాడు. విశాఖ దరి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 డిసెంబరులో డిప్లమో పూర్తి చేసి 88 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. గతేడాది డిప్లమో చివరి ఏడాదిలో ఏపీ ఈ-సెట్ రాస్తే తనకు ఎనిమిదవ ర్యాంకు వచ్చిందని ఖ్యాతీశ్వర్ తెలియజేశారు. ఈ ఏడాది కూడా ఈ-సెట్ రాశానని, ఇంకా ఫలితాలు రావాల్సి ఉందన్నారు. ఖ్యాతీశ్వర్ తండ్రి మిన్నారావు సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన జీవనరేఖ ఆస్పత్రిలోని కాంట్రాక్టు పద్ధతిలో కాంపౌండరుగా పనిచేస్తున్నారు. తల్లి హైమావతి గృహిణి. వీరి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జోగిపాలెం గ్రామం. భవిష్యత్తులో ప్రభుత్వ ఇంజినీర్ కావడమే తన లక్ష్యమన్నారు.

జూన్ ఒకటి నుంచి సార్వత్రిక టెన్త్ పరీక్షలు

అనకాపల్లి రూరల్, మే 21 : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారిచే నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలు జూన్ ఒకటి నుంచి ఎనిమిదవ తేదీ వరకు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులంతా పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి కలెక్టరేట్, మే 21 : జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పేర్కొన్నారు. మంగళవారం వెబెక్స్ ద్వారా ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో 14,804 మంది విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతారన్నారు. వీరి కోసం 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కౌంటింగ్ నాడు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి

» అధికారులకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశం

అనకాపల్లి రూరల్, మే 21 : వచ్చే నెల నాల్గో తేదీన జరగనున్న కౌంటింగ్ నాడు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ఫలితాల రోజు నుంచి 15 రోజుల వరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని గ్రామాల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఏపీఆర్‌డీసీ పరీక్షల్లో దేవిప్రసాద్‌కు 29 ర్యాంక్


దేవి శ్రీప్రసాద్

కోటవురట్ల, మే 21: ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్‌డీసీ పరీక్షల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న కోటవురట్ల గ్రామానికి చెందిన ఆర్. హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్ (సీఈసీ) రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంక్ సాధించి నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో డీకామ్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్‌టీ సుజాత మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగాల్లోనైనా లక్ష్యాన్ని సాధించవచ్చునని హర్షవర్ధన్ దేవి శ్రీప్రసాద్ నిరూపించడన్నారు. ఈసందర్భంగా దేవిశ్రీప్రసాద్‌ను అధ్యాపకులు అభినందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- డీఎస్పీ కేవీ సత్యనారాయణ



ముత్యాలమ్మపాలెంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ, మే 21 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఆయన ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెల నాల్గో తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో బెట్టింగ్‌లు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అందరూ సోదరభావంతో మెలగాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ సీఐ బాల సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి : సీడీపీవో



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం, మే 21 : మహిళలు, కిశోర బాలికలు ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని సీడీపీవో లలితకుమారి సూచించారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, కిశోర బాలికలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం గర్భిణులు, కిశోర బాలికలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలన్నారు. మహిళలు, యువతులు పీరియడ్స్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలని సూచించారు. ప్రసవ సమయంలో గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆర్. పైడితల్లి, వై. రమాదేవి, ఏఎన్ఎం అనురాధ, మహిళా పోలీస్ నళిని, అంగన్‌వాడీ కార్యకర్త ఎం. చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

దుప్పితూరులో ఘనంగా చిట్టి పైడితల్లమ్మ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మే 21: దుప్పితూరులో చిట్టి పైడితల్లమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. బ్రాండిక్స్ కర్మాగారాన్ని ఆనుకొని ఉన్న అమ్మవారికి మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు స్వగ్రామం కావడంతో అమ్మవారికి ఆయన పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోడానికి మార్టూరు, కోనెంపాలెం, కుమారపురం, అచ్యుతాపురం, తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, మజ్జిగ, పులిహోర ఏర్పాటు చేశారు.

సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించాలి : ఈవోపీఆర్‌డీ



మంగవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మే21 : గ్రామాలలోని చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని సత్యవరం, మంగవరం గ్రామాలలోని ఎస్‌డబ్ల్యూఎమ్ షెడ్‌లను మంగళవారం ఆయన సందర్శించి పరిశీలించారు. గ్రామాలలోని చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించి, వర్మీ కంపోస్టును తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె. నరేష్, శ్రీధర్, ఆచారి పాల్గొన్నారు.

నేడు 'శ్రీరాంపురం'లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకరావుపేట రూరల్, మే21: మండలంలోని శ్రీరాంపురం 33 కేవీ సబ్‌స్టేషన్‌లో పరిధిలో బుధవారం విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు కొడుతున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు.అందువల్ల శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, శ్రీరాంపురం, కొత్తూరు గ్రామాలకు బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టణంలోని జంక్షన్ల వద్ద మరీ దారుణం
- పలు సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య
- ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ అంతంతమాత్రమే



ఎలమంచిలి బస్టాండ్ జంక్షన్ వద్ద ఇష్టానుసారంగా నిలిపిన ఆటోలు

ఎలమంచిలి, మే 21 : పట్టణంలో వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రజలకు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా జంక్షన్లు, టర్నింగ్ పాయింట్లు, బస్టాండ్ ఇన్‌గేటు, అవుట్ గేట్ల వద్ద కొందరు వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. కొందరు ఆటోవాలాలు వెళుతూ ప్రయాణికులను చూసిన వెంటనే సడన్ బ్రేకులు వేసి నిలుపుదల చేస్తుండడంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సమస్య కూడా ఎదురవుతోంది. ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేటు వద్ద కొందరు ఆటోలను నిలుపు చేస్తుండడంతో బస్సులు వెళ్లేందుకు ఇబ్బంది అవుతోంది. దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద, ఆస్పత్రి జంక్షన్ల వద్ద రోడ్లపైనే ఆటోలు నిలుపుదల చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉంటుంది. పట్టణ ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

- ఉదయం నుంచి పలు పర్యాయాలు అంతరాయం
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- బోర్లు పనిచేయక నీటికి తిప్పలు

పాయకరావుపేట, మే 21 : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడతుండడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. పట్టణంలో పంచాయతీ కొళాయిలు లేని పలు కాలనీల్లో విద్యుత్ లేక బోర్లు పనిచేయక నీటి కోసం సాయంత్రం వరకు వేచిచూడాల్సి వచ్చింది.

పట్టణంలోని పలు కూల్ డ్రింక్స్ షాపులు, జూస్ సెంటర్లలో మిక్సీలు, ఫ్రిజ్‌లు సాయంత్రం వరకు పనిచేయక చిరువ్యాపారులు నష్టపోయారు. స్థానిక సబ్ స్టేషన్‌లో సమస్య తలెత్తిన కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని తెలియజేసిన అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించారు. ప్రస్తుత ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతలతో వేడిగాలులు, ఉక్కపోతకు గురవుతున్న పట్టణ ప్రజలు రాత్రిపూట విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూడిమడక ఉప్పుటేరులో చేపలు మృతి


- కర్మాగారాల కాలుష్య కారక వ్యర్థాలే కారణమంటున్న జాలర్లు
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు



పూడిమడక ఉప్పుటేరులో చనిపోయిన చేపలు

అచ్యుతాపురం, మే 21: పూడిమడక ఉప్పుటేరులో మంగళవారం చేపలు చనిపోయి గట్టుకు కొట్టుకు వచ్చాయి. దీంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కర్మాగారాల నుంచి వెలువడిన కాలుష్య కారక వ్యర్థాలు ఉప్పుటేరు నీటిలో కలవడం వల్లే చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. పూడిమడకని ఆనుకొని ఉన్న ఉప్పుటేరులో కూడా మత్స్యకారులు చేపల వేట చేస్తారు. కలుషితం కారణంగా ఉప్పుటేరులోని నీరు నల్లగా మారిపోయి చేపలు చనిపోయి పైకి తేలిపోతున్నాయి. అలాగు పాముల వలే ఉండే జీవులు చనిపోయి నీటిలో తేలుతున్నాయి. వీటిని చూసి నీటిలో దిగడానికే మత్స్యకారులు భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ చోడిపల్లి అప్పారావు డిమాండ్ చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అనకాపల్లి టౌన్, మే 21 : మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్థంతిని మంగళవారం నాయుళ్లవీధిలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్ గంగాధర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి సత్యారావు, ఎగ్గాడ భాస్కరరావు, దాసరి సంతోష్, గజ్జాలు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో.. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మంగళవారం కశింకోట ప్రధాన రహదారిలో నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, మలపురెడ్డి కోటేశ్వరరావు, పీఎస్.దత్తు, బోయిన భానుమూర్తి యాదవ్, తుట్ట రమణ, కాళ్ల సత్యనారాయణ, బుద్ద కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం



ఎలమంచిలిలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, పెద్దలు

ఎలమంచిలి, మే 21: స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, నీతి కథలు, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఆనంద్ పర్యవేక్షణలో విద్యార్థుల మేధస్సుకు మరింత పదును పెట్టేలా వేసవి విజ్ఞాన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వై. అప్పారావు, పీడీ దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు సీతారామయ్య విద్యార్థులకు హిందీ పదాలు తెలుగులో చెప్పడం, హిందీలో మాట్లాడడం, స్పోకెన్ ఇంగ్లీషు, డైరీ రాయించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా ఎస్‌టీ.సీతారామమూర్తి విద్యార్థులకు తెలుగు పదాలు, బ్యాంకు లావాదేవీలు, పోస్టల్ విధానం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

పట్టణ రోడ్లపై బైక్‌ల హోరు

- ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు
- వాహనాలను నడుపుతున్న మైనర్లు
- ఎన్నికల విధుల్లో పోలీసులు
- చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు వినతి



పట్టణంలో ద్విచక్ర వాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు

ఎలమంచిలి, మే 21: ఎలమంచిలి పట్టణ రోడ్లపై కొందరు యువకులు , మైనర్లు అమిత వేగంతో బైక్‌లను నడుపుతున్న సంఘటనలు ఇటీవల అధికమయ్యాయి. రోడ్లపై కొందరు యువకులు తమ బైక్‌లను అత్యంత వేగంతో నడపడంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ట్రిపుల్ రైడింగ్‌తో పాటు మైనర్‌లు వీధుల్లో విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తున్నారు. కొంతరు యువకులు నిబంధనలకు విరుద్ధంగా తమ వాహనాల సైలెన్స్‌లను మరింత శబ్దం వచ్చేలా వాహనాలను తీర్చిదిద్దుతున్నారు. జన సమూహం అధికంగా ఉండే జంక్షన్ల వద్ద ఈ తరహా బైక్‌లతో హల్‌చల్ చేస్తున్నారు. వీటన్నింటిని కట్టడి చేయాల్సిన పోలీసులు ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో వీరి ఆగడాలకు అంతు లేకుండా పోతున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ట్రిపుల్ రైడింగ్, వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుర్గానగర్‌లో ఆదమరిస్తే అంతే..

- గెడ్డ కాలువపై నూతనంగా కల్వర్టు విస్తరణ
- కల్వర్టుకు అప్రోచ్ రోడ్డు వేయని అధికారులు



సర్వీసు రోడ్డును ఆనుకుని గెడ్డ కాలువపై కల్వర్టు వెడల్పు చేసిన దృశ్యం

పాయకరావుపేట, మే 21 : పట్టణంలోని జాతీయ రహదారి అవతల దుర్గానగర్‌లోకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో గెడ్డ కాలువపై కల్వర్టు నిర్మించిన అధికారులు అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారంటున్నారు. స్థానిక జాతీయ రహదారిపై ఉన్న రైల్వే వంతెనను ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డు నుంచి దుర్గానగర్‌లోకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో ఉన్న గెడ్డపై కొద్ది నెలల క్రితం కల్వర్టును పునర్నిర్మించారు. అయితే కల్వర్టుకు ఆనుకొని అప్రోచ్ రోడ్డు వేయలేదు. దీంతో దుర్గానగర్‌లోకి వెళ్లే వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా పది అడుగుల గోతిలో పడిపోతామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఈ రోడ్డునే ఉపయోగిస్తారు. ఇప్పటికైనా పీఆర్ అధికారులు స్పందించి కల్వర్టును ఆనుకుని అప్రోచ్ రోడ్డు వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రెయిలింగ్‌ను తొలగించారు.. నిర్మాణం మరిచారు

- ప్రమాదకరంగా మారిన యల్లయ్య కాలువ కల్వర్టు



ప్రమాదకరంగా మారిన ఉడ్‌పేటలోని యల్లయ్యకాలువ

అనకాపల్లి టౌన్, మే 21: ఉడ్‌పేటలోని వాటర్‌ట్యాంక్ సమీపాన ఉన్న యల్లయ్యకాలువపై ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టుపై ఉన్న రెయిలింగ్‌ను జీవీఎంసీ అధికారులు తొలగించి ఆరు నెలలు దాటినా నేటికి దాని స్థానంలో సిమెంట్ గట్టు నిర్మించకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులకు ప్రమాదకరంగా మారింది. గతేడాది చివరలో జీవీఎంసీ అధికారులు యల్లయ్యకాలువలో పూడికలు తీయించే సమయంలో కాలువలోకి చిన్నసైజు ఎక్స్‌కవేటర్‌ను దించి కాలువలో పూడికలు తీయించారు. ఈ ఎక్స్‌కవేటరును కాలువలోకి దించేందుకు ఉడ్‌పేటలోని కల్వర్టుకు ఒక పక్కనున్న సిమెంట్ రెయిలింగ్‌ను తొలగించారు. పూడికతీత పనులు పూర్తి చేసి ఆరు నెలలు దాటినా తొలగించిన రెయిలింగ్‌ను నిర్మించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీనికితోడు చీకటి పడితే ఈ మార్గంలో ప్రయాణం భయంగా మారింది. తొలగించిన సిమెంట్ రెయిలింగ్‌ను తక్షణమే ఏర్పాటు చేసి ప్రయాణికుల భయాందోళనను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఇసుకను తరలిస్తున్నారు. చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో మండలంలోని 12 గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా చేసేందుకు గతంలో ఇన్ ఫిల్టర్ వెల్‌ను ఏర్పాటు చేశారు. అయితే కొందరు రాత్రివేళల్లో ఇన్ ఫిల్టర్ వెల్ చుట్టూ ఉన్న ఇసుకను కూడా తవ్వేస్తున్నారు. దీని వల్ల ఇన్ ఫిల్టర్ వెల్‌కు నీటి నిల్వలు తగ్గి 12 గ్రామాలకు తాగునీటి సమస్య వస్తుందని, వెంటనే అక్కడ ఇసుక తవ్వకాలు ఆపేయాలని మండల పరిషత్ సమావేశంలో నీటి పారుదలశాఖ అధికారులు చెప్పినా అక్రమార్కులు ఆగడం లేదు.

చిక్కుడుపాలెం వద్ద జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా ఏడాదిన్నర క్రితం మూసేశారు. ఇక్కడ చెక్‌పోస్టు దగ్గర సీసీ కెమెరాలు ఉండడంతో అప్పట్లో ఇసుక ట్రాక్టర్లు జిల్లా సరిహద్దు దాటి వెళ్లేవి కాదు. ఇప్పుడు చెక్‌పోస్టు మూసి ఉండడంతో ఇసుక తవ్వకాలు చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో ఎక్కువయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, గనుల శాఖల అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకున్న దాడి రత్నాకర్


అనకాపల్లి టౌన్, మే 21 : స్థానిక గవరపాలెం విజ్ఞాన సమితి కేంద్రం వద్ద కొలువైన ఆంజనేయస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించి, ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల చంద్రదేవ్, కోరిబిల్లి హరి, విల్లూరి బాలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యామాంబ అమ్మవారి పండగ రేపు

పరవాడ, మే 21: మండల కేంద్రంలో ముత్యామాంబ అమ్మవారి పండగను గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

అచ్యుతాపురంలో హైమాస్ట్ వెలుగులు

- చొరవ చూపిన సీఐ బుచ్చిరాజు



అచ్యుతాపురంలో వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

అచ్యుతాపురం, మే 21: అచ్యుతాపురం జంక్షన్‌లో సోమవారం రాత్రి నుంచి హైమాస్ట్ లైట్లు వెలుగుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) కారణంగా అచ్యుతాపురం జంక్షన్‌లో భారీగా ట్రాఫిక్ పెరిగింది. రాత్రి పూట కూడా భారీ వాహనాలు అచ్యుతాపురం జంక్షన్ గుండా సెజ్‌కు వెళుతున్నాయి. దీంతో ఏపీఐఐసీ అచ్యుతాపురం నుంచి సెజ్ వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మించింది. ఈ రోడ్డులో అచ్యుతాపురం జంక్షన్‌లో హైమాస్ట్ లైట్లు కూడా ఏర్పాటు చేసింది. అయితే ఆ లైట్లు రెండేళ్ల నుంచి వెలగడం లేదు. ఇక్కడ రాత్రి వేళ విధులు నిర్వహించే పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో స్థానిక సీఐ బుచ్చిరాజు చొరవ తీసుకొని జంక్షన్‌లో గల హైమాస్ట్ లైట్లకు కొత్త బల్బులు వేయించడంతో సోమవారం రాత్రి నుంచి వెలుగుతున్నాయి.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

అచ్యుతాపురం, మే 21: ఖరీఫ్ సీజన్‌కి పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ విస్తరణాధికారి కేబీ. సూర్యనారాయణ తెలిపారు. జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. జనుము, జీలుగ పది కేజీ రూ.440, పిల్లి పెసర ఎనిమిది కేజీలు రూ. 540కి విక్రయిస్తున్నామన్నారు. ఎకరా భూమిలో జనుము, జీలుగ పదికేజీలు చొప్పున, పిల్లి పెసర అయితే ఎనిమిది కేజీలు వేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట పూత దశకు వచ్చినప్పుడు కలియదున్నుకోవాలని సూచించారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డుతో ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా లోవాంబిక పుట్టుక మహోత్సవం

రాంబిల్లి, మే 21 : మండలంలోని గోకివాడలో కొలువైన లోవాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని స్థానికులే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు వచ్చి పూజలు చేశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకున్నది.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న కంటి రోగులు

అనకాపల్లి టౌన్, మే 21 : స్థానిక ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మంది పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు జరిగాయి. సోమవారం ఆస్పత్రికి 21 మంది కంటి పరీక్షలకు హాజరుకాగా వారికి నేత్ర వైద్య సహాయకులు పి.దేవి పరీక్షలు నిర్వహించి ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం కంటి ఆస్పత్రిలో ఎనిమిది మందికి డాక్టర్ కె. మల్లేశ్వరరావు ఐఓఎల్ కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఐదు రోజులకు సరిపడా మందులను అందజేశామని చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు.

సబ్బవరం చేరుకున్న టెన్త్ పుస్తకాలు



ఎంఆర్‌సీకి వచ్చిన పదో తరగతి పుస్తకాలు

సబ్బవరం, మే 21 : 204-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తదరగతి పుస్తకాలు ఎంఆర్‌సీకి మంగళవారం చేరుకున్నాయని ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఐదు జడ్పీ హైస్కూల్స్, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన 584 మంది పదో తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి 5,984 పుస్తకాలు వచ్చాయని తెలిపారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు అందజేస్తామన్నారు. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు పుస్తకాలు రావలసి ఉందన్నారు.

మూడు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు



వెన్నెలపాలెంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పరవాడ, మే 21: మండలంలోని వెన్నెలపాలెం, తానాం, పరవాడ గ్రామాల్లో మంగళవారం రాత్రి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ అయిన తర్వాత కూడా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలంతా సంయమనంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపాలిటీ పోలింగ్‌పై ఉత్కంఠ

47,723 ఓటర్లకు 36,921 మంది ఓటు హక్కు వినియోగం

77 శాతం నమోదు.. నియోజకవర్గంలో సరాసరి ఏడు శాతం తక్కువ

నర్సీపట్నం మండలంలో 88 శాతం పోలింగ్

అభ్యర్థుల గెలుపు, ఓటములపై గ్రామీణ ఓటరు ప్రభావం

గెలుపు అంచనాలు, మెజారిటీపై టీడీపీ, వైసీపీ సమీక్షలు

నర్సీపట్నం, మే 21: సార్వత్రిక ఎన్నికలలో మునిసిపాలిటీలో నమోదైన పోలింగ్ ఉత్కంఠ రేపుతోంది. పట్టణ పరిధిలోని నర్సీపట్నం, బలిఘట్టం, పెదబొడ్డేపల్లిలోని 54 పోలింగ్ కేంద్రాలలో 47,723 ఓటర్లు ఉండగా 36,921 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 77 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో పోలింగ్ సరాసరి కంటే పురపాలక సంఘంలో ఏడు శాతం తక్కువ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గ్రామీణంలోని 12 పంచాయతీలు, మునిసిపాలిటీ కలిపి నర్సీపట్నం మండలంగా ఉంది. మండలంలోని 12 పంచాయతీలలో 25,042 మంది ఓటర్లు ఉంటే 22,112 మంది 88 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునిసిపాలిటీకి వచ్చేసరికి 77 శాతం మంది మాత్రమే ఓట్లు వేశారు. పట్టణ ప్రాంతం కంటే గ్రామీణ ప్రాంతంలో ఉండే మునిసిపాలిటీ వార్డులలోనే 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. ఉదాహరణకు 20వ వార్డు కృష్ణాపురం గ్రామంలోని 138 పోలింగ్ కేంద్రంలో 94.25 శాతం పోలింగ్ జరిగింది. 19వ వార్డులోని కొత్త బయపురెడ్డిపాలెం, పాత బయపురెడ్డిపాలెంలో 139, 140 పోలింగ్ కేంద్రాలలో 90 శాతానికి పైగా పోలింగ్ జరిగింది. పట్టణంలో ఉండే తొమ్మిదో వార్డు 141 పోలింగ్ కేంద్రం, 16, 20 వార్డుల పరిధి శారదానగర్ 142, 143, 144 పోలింగ్ కేంద్రాలలో 60 శాతం కంటే తక్కువ పోలింగ్ జరిగింది. ఇదిలా ఉండగా పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు లెక్కలు వేసుకుంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, నర్సీపట్నం గ్రామీణంతో పాటు మునిసిపాలిటీ మెజారిటీపై అభ్యర్థులు సమీక్షలు చేసుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. పట్టణ మెజారిటీపై ఒకరు, గ్రామీణ మెజారిటీపై మరొకరు ఆశలు పెట్టుకున్నారు. ఓటరు మాత్రం నిశ్శబ్దంగా ఉన్నాడు. ఏం జరుగుతోందోన్న ఉత్కంఠ ప్రతీ ఒక్కరిలోనూ నెలకొంది. ఓట్ల లెక్కింపు తేదీ కోసం రోజులు లెక్కించుకుంటూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. టీడీపీ, వైసీపీ నాయకులు, అభిమానులు రూ.లక్షల్లో పందేలు కాస్తున్నట్టు తెలిసింది.



తగ్గిన మామిడి ధర.. రైతులు దిగాలు

- కె. సంతపాలెం రైతుబజారుకు పలు మండలాల నుంచి ఒక్కసారిగా పంట రాక
- రూ. 2వేలు పలికిన క్రేటు పండ్ల ధర రూ. 1,500కు పరిమితం

కె.కోటపాడు, మే 21: మామిడి ధర పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని కె. సంతపాలెం రైతుబజార్‌కు మంగళవారం పరిమితికి మించి మామిడి పంట రావడంతో ధర తగ్గిపోయింది. బంగినపల్లి, సువర్ణరేఖపండ్లు క్రేటు నిన్నటి వరకు రూ. 2 వేలు పలికిన ధర మంగళవారానికి రూ. 1500కు తగ్గిపోయినట్టు రైతులు వాపోతున్నారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో అల్పపీడనంనకు అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలతో రైతులంతా వర్షాలకు భయపడి ముందుగానే మామిడికాయలు కోసేశారు. దీంతో రైతుబజార్‌కి భారీగా మామిడి దిగుమతి అయింది. ఈ రైతు బజార్‌లో మామిడితో పాటు కూరగాయలు కూడా కొనుగోలు చేసి విశాఖపట్నం నగరానికి తీసుకువెళ్లి అమ్మకాలు సాగిస్తారు. అయితే, తాము పండించిన మామిడిపండ్లకు సరైన గిట్టుధర రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రైతు బజారుకు తెల్లవారుజామున మూడు గంటలకే మామిడిపండ్లు, కూరగాయలు చేరుకోవడంతో అప్పటి నుంచే అమ్మకాలు జరుగుతుంటాయి. ఇక్కడకు తుని, చోడవరం, అనకాపల్లి, దేవరాపల్లి, కొత్తవలస, విశాఖపట్నం నుంచి వర్తకులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మండలానికి ఈ ఒక్కటే రైతు బజారు కావడంతో రైతులంతా ఇక్కడకు వచ్చి తాము పండించిన పంటలను విక్రయిస్తుంటారు. దీంతో పలువురు వర్తకులు ఇక్కడనుంచి కొనుగోలు చేసి వారి వారి గమ్యస్థానాలకు చేర్చి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మండలంలో ఒక్క రైతుబజారే కావడంతో ధర పడిపోయినా చేసేదిలేక ఎంతో కొంతకు విక్రయించాల్సి వస్తోందని రైతులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మరికొన్ని గ్రామల్లో రైతులు బజారులు ఏర్పాటు చేస్తే రవాణా ఖర్చు కూడా తగ్గుతుందని అంటున్నారు.



కె. సంతపాలెం రైతు బజారుకు భారీగా చేరిన మామిడిపండ్లు

గిట్టుబాటు ధరలేదు..

మండలంలోని పలు గ్రామాల్లో మరికొన్ని రైతుబజార్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. తాము పండించిన పంటలకు ఒక్కచోటే కాకుండా మరోచోట విక్రయించుకుంటే కొంతమేర ఊరటనిస్తుంది. రైతు బజార్లు గ్రామాల్లో ఏర్పాటు చేస్తే ముఖ్యంగా రవాణా ఖర్చు తగ్గుతుంది. మండలంలో ఒక్కచోటే రైతు బజారు ఉండడం వల్ల సరకంతా ఒక్కచోటకే ఎక్కు. దిగుమతి కావడంతో రైతులు తాము పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదు.

- కనకారావు, రైతు, చంద్రయ్యపేట



అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు

- నర్సీపట్నం డీఎస్పీ మోహన్.. పోలీసు బలగాలతో కార్డన్ సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో డీఎస్పీ, పట్టణ సీఐ, ఎస్ఐలు

నర్సీపట్నం, మే 21: పట్టణంలో అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మోహన్ హెచ్చరించారు. మంగళవారం బీసీ కాలనీ, పెదబొడ్డేపల్లిలో సాయుధ పోలీసు బలగాలతో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి 8 గంటల వరకు వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులు లేని 68 బైక్‌లు, బొలెరో వాహనం, కారు, ఆటో స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తనిఖీలలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు, కారు, ఆటో, బొలెరో వాహనాకు సంబంధించిన యజమానులు సరైన రికార్డులు చూపిస్తే వాహనాలు విడిచి పెడతామని తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో గంజాయి కేసులో ఉన్న బొంతు రాంబాబును అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు కోడ్, 144 సెక్షన్లు అమలులో ఉంటాయని తెలిపారు. పోలీసులకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ కాంతికుమార్, ఎస్ఐలు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- నర్సీపట్నం డివిజన్ టీబీ, ఎఫ్‌పీ పీవో డాక్టర్ ప్రశాంతి
- ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ

కృష్ణాదేవిపేట, మే 21: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే ఆర్ఎంపీ క్లినిక్‌లపై చర్యలకు తప్పవని నర్సీపట్నం డివిజన్ టీబీ అండ్ ఎఫ్‌పీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.ప్రశాంతి తెలిపారు. 'ఆర్ఎంపీ వైద్యుడు నిర్లక్షానికి నిండు ప్రాణం బలి' అనే కథనంపై జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో స్పందించారు. వారి ఆదేశాల మేరకు మంగళశారం విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఎంపీ వైద్యుడు రామదాసు క్లినిక్ వెళ్లి పరిసరాలు పరిశీలించి మృతి చెందిన సత్యనారాయణకు వైద్య సేవలు అందించారా? లేదా? అనే వివరాలు సేకరించారు. అలాగే లింగంపేటలో మృతుడు సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించి, అతని భార్య రమణమ్మ, కుమార్తె సత్య, ఇతర కుటుంబ సభ్యులను విచారించగా ఆర్ఎంపీ వైద్యుడు రామదాసు వద్ద మూడు రోజులు వైద్య సేవలు పొందామని, పరిస్థితి విషమించటంతో విశాఖ తీసుకువెళ్లగా సూచించారని చెప్పారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వోకు అందిస్తానని చెప్పారు. అలాగే ప్రైవేటు క్లినిక్‌పై నిరంతరం నిఘా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంతి, వైద్యులు

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

మాడుగుల, మే 21: స్థానిక శతకంపట్టు వద్ద నున్న శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అధికారి వెకటేశ్వరరావు ప్రారంభించారు. జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న ఈశిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 8 గంటలనుంచి 11:30 గంటల వరకు జరిగే ఈశిబిరంలో పుస్తక ప్రదర్శన, కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, చి త్రకళ తదితర అంశాలపై పోటీలు, అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. చివరిరోజున విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తామన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

దేవరాపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో బాగంగా స్పోకేన్ ఇంగ్లీషు, గ్రామర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు గ్రంథాలయ అధికారి ఓ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. దీంతో పాటు, సామెతలు కథలు పుస్తకాలు చదివించినట్టు వివరించారు.



మాడుగులలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బాలలకు ఆటల పోటీలు

రావికమతం: కొత్తకోట శాఖ గ్రంథాలయంలో బాలలకు ఆటల పోటీలతోపాటు కథలు పఠనం, ఇతర బుక్ స్రీడింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల15 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే పిల్లలకు ఆట పాటలతోపాటు కథలు వినిపిస్తున్నారు. వారికి ఏ కళలపై మక్కువో తెలుసుకుని వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. పోటీలు నిర్వహిస్తున్నారు. జూన్ 7న ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులందజేస్తామని లైబ్రేరియన్ వరహామణి తెలిపారు.



దేవరాపల్లిలో పుస్తక పఠనంలో చిన్నారులు

రికార్డుల్లో సమాచారం సమగ్రంగా ఉండాలి

రోలుగుంట, మే 21 : స్థానిక వెలుగు కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 80 గ్రామ సమాఖ్య సంఘాలకు సంబంధించి మంగళవారం వార్షిక ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వ హించారు. రూ.83 లక్షలకు మంజూరైన నిధులను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామ సంఘ ప్రతినిధులు తీసుకువచ్చిన రికార్డులను ఆడిట్ బృందం క్షుణ్ణంగా పరిశీలించారు. ఇచ్చిన రుణం, జమలను సరిపోల్చారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారమందించేలా గ్రామ సంఘం ప్రతినిధులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ ఆడిట్‌లో ఏరియా కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ, ఎల్‌సీ శ్రీను, ఏపీఎం కె.సాధన పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు

ఎన్నికల అంక్షలు ఉల్లంఘించొద్దు: ఎస్ఐ

బుచ్చెయ్యపేట, మే 21: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు అన్నిచోట్లా 30, 144 సెక్షన్ అమలులో ఉంటాయని ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. ఆయన ఈ ఎన్నికల కోడ్ ఆంక్షలపై బుచ్చెయ్యపేట, పెదమదీన, కొండపాలెం, కేపీ అగ్రహారం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు ముందు తరువాత సభలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. హింస, అల్లర్లకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి అన్ని వర్గాలు సహకరించారన్నారు. అలాగే, ఓట్ల లెక్కింపు సమయంలో సంయమనం పాటించాలని ఆయన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఈశ్వరరావు

సతకంపట్టులో కొలువుదీరిన మోదకొండమ్మ

మాడుగుల, మే 21: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని మంగళవారం స్థానిక సత కం పట్టు వద్ద కొలువు దీరారు. జూన్ 18వ తేదీన నిర్వహించనున్న అమ్మ వారి జాతర సందర్భంగా సిద్ధాంతి భమిడిపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఉదయం 9:05 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి బయలుదేరిన అమ్మవారి ఘటాలు, పాదాలను ఊరేగింపుగా తీసుకొని వెళ్లి సతకం పట్టు వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 10:15 గంటలకు కొలువు దీర్చారు. ఈ ఊరేగింపులో అమ్మవారి మాల ధారులు, గ్రామ పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి ఘటాలను తీసుకువెళ్లే మార్గమంతా చల్లదనం చేశారు.



మోదకొండమ్మ అమ్మవారు



అమ్మవారి ఘటాలు, పాదాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

గ్రంథాలయంలో వేసవి శిబిరం

నర్సీపట్నం, మే 21: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం గ్రంథాలయ అధికారి దమయంతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్, సీఆర్‌పీ భవాని, శ్రీనివాసరావు, చిన్నారులకు చిత్రలేఖనం నేర్పించి, కథలు వినిపించారు. దేశంలోని రాష్ట్రాలు, వాటి రాజధానుల పేర్లు పిల్లలతో చెప్పించారు.

ఘనంగా పరదేశమ్మ అమ్మవారి పండగ

చీడికాడ, మే 21: మండలంలోని కెఎల్‌బీ.పట్నం గ్రామంలో పరదేశి మాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ వబలరెడ్డి అమ్మ తల్లినాయుడు, సభ్యులు గండి బాబ్జీ, జోకల దేముడుబాబుల ఆధ్వ ర్యంలో జరిగిన ఈ పండగలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు సిద్ధం

రావికమతం,మే 21: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రూప మంగళవారం తెలిపారు. తొలకరి వర్షాలు పడుతున్న తరుణంలో రైతులు వేసవి దుక్కులు చేసుకుని పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలువేయాలనికోరారు. వీటి సాగుతో భూసారం పెరిగి, ఖరీఫ్‌లో వరి సాగులో మంచి దిగుబడులు వస్తాయన్నారు. రసాయనిక ఎరువులు అవసరం ఉండదని తెలిపారు.



రావికమతం ఆర్‌బీకేల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట ఎరువులు

మాడుగుల మండలంలో..

మాడుగుల రూరల్: రైతులకు పచ్చిరొట్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పచ్చిరొట్టె పంటలు సాగుకు ఎంతో దోహదపడతాయన్నారు. మండలంలో గత 20 రోజుల్లో 9 రోజులపాటు వర్షపాతం నమోదైందన్నారు. ఈ నెల సాధారణ వర్షపాతం 120 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటికే 98 మిల్లీ మీటర్లు నమోదైనట్టు ఆయన వివరించారు. ఈ వర్షాలు వేసవి దుక్కులకు అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకుని ఆర్‌బీకేల్లో వ్యవసాయ సిబ్బందిని కలుసుకుని పేరు నమోదు చేసుకోవాలన్నారు. జీలుగు, జనుముకిలో ధర రూ88 కాగా రాయితీ రూ44లు పోను రూ. 44లకే అందిస్తారని, పిల్లి పెసర కిలో రూ. 134 కాగా రాయితీ మినహా రూ. 67కు అందిస్తామని చెప్పారు.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ఇసుకను తరలిస్తున్నారు. చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో మండలంలోని 12 గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా చేసేందుకు గతంలో ఇన్ ఫిల్టర్ వెల్‌ను ఏర్పాటు చేశారు. అయితే కొందరు రాత్రివేళల్లో ఇన్ ఫిల్టర్ వెల్ చుట్టూ ఉన్న ఇసుకను కూడా తవ్వేస్తున్నారు. దీని వల్ల ఇన్ ఫిల్టర్ వెల్‌కు నీటి నిల్వలు తగ్గి 12 గ్రామాలకు తాగునీటి సమస్య వస్తుందని, వెంటనే అక్కడ ఇసుక తవ్వకాలు ఆపేయాలని మండల పరిషత్ సమావేశంలో నీటి పారుదలశాఖ అధికారులు చెప్పినా అక్రమార్కులు ఆగడం లేదు. చిక్కుడుపాలెం వద్ద జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా ఏడాదిన్నర క్రితం మూసేశారు. ఇక్కడ చెక్‌పోస్టు దగ్గర సీసీ కెమెరాలు ఉండడంతో అప్పట్లో ఇసుక ట్రాక్టర్లు జిల్లా సరిహద్దు దాటి వెళ్లేవి కాదు. ఇప్పుడు చెక్‌పోస్టు మూసి ఉండడంతో ఇసుక తవ్వకాలు చిక్కుడుపాలెం వద్ద తాండవ నదిలో ఎక్కువయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, గనుల శాఖల అధికారులు స్పందించి ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

102.1 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

వ్యవసాయ శాఖ ఏడీ నీలవేణి



నర్సీపట్నం, మే 21: సబ్ డివిజన్ పరిధిలో 102.1 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు ప్రతిపాదనలు పంపినట్టు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నీలవేణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు 50 రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని రోలుగుంట, నర్సీపట్నం, గొలుగొండ, రావికమతం, వి మాడుగుల మండలాలలో 62 క్వింటాళ్ల జీలుగ, 23.5 క్వింటాళ్ల జనుము, 16.6 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలకు ప్రతిపాదనలు పెట్టామని ఆమె తెలిపారు. పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదార్ పుస్తకం, ఫోన్ నంబరుతో రైతు భరోసా కేంద్రాలకు వెళ్లాలని, అక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

నాతవరం, మే 21: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వీధులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సూచించారు. అలాగే తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, కుళాయిల పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జ్వరాలు వస్తున్నందున నీటిని వేడి చేసి తాగాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎన్నికల కోడ్ ఉంటుందని, అందరూ ఎన్నికల నిబంధానలు పాటించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి



ఎండలకు నిర్మాణుష్యంగా ఉన్న జోగంపేట జంక్షన్

గొలుగొండ, మే 21: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కాసిన తీవ్రమైన ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. పలు గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగింది. దీంతో జోగంపేట, గొలుగొండ, చీడిగుమ్మల, ఏటిగైరంపేట గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారులు జన సంచారం లేక బోసిపోయాయి. దీనికితోడు వడగాడ్పులు మరింత పెరగడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

మాడుగుల, మే 21: మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 33వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పడాల కొండలరావు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి శ్రీనివాసరావు, రాపేటి సత్యనారా యణ, పుట్టా అమరయ్య శెట్టి గుప్తా తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు



చీడిపల్లిలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

చీడికాడ, మే 21: గొర్రెలు, మేకలకు ప్రాణాంతక వ్యాధులు సోకకుండా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు పెదగోగాడ పశువైద్యాధికారి సీహెచ్.రాఘవమ్మ తెలిపారు. మండలంలో చీడిపల్లి, చుక్కపల్లి గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి వంద చొప్పున గొర్రెలకు వ్యాక్సిన్లువేసినట్టు చెప్పారు. గొర్రెలకు చుట్టుకవ్యాధిని నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తున్నా మన్నారు. మండలంలో ఉన్న గొర్రెల కాపర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ సహకారంతో శ్మశానవాటిక అభివృద్ధి



ప్రహరీకి రంగులు వేస్తున్న సీపీఐ కార్యకర్తలు

చోడవరం, మే 21: పట్టణంలోని అంకుపాలెం రోడ్డులో అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి సీపీఐ కార్యకర్తలు శ్రీకారం చుట్టారు. శ్మశాన వాటిక ఆక్రమణలకు గురికాకుండా, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు కృషి చేశారు. ఇప్పుడు ఆ వాటికకు రంగులు వేసే కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. దాతల సహకారం తో ఈ పనులుచేపడుతున్నట్టు అప్పలరాజు తెలిపారు. శ్మశానవాటిక అభివృద్ధికి చొరవ తీసుకున్న ఆయనను స్థానికులు అభినందిస్తున్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట, మే 21: మండల పరిషత్‌కార్యాలయంలో ఈ నెల 28న ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మండల సమావేశం జరగనున్నదని ఎంపీడీఓ శ్రీకాంత్ ఆచార్యులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.